సంక్షేమంతో పేదరిక నిర్మూలన

గడప గడపకు మన ప్రభుత్వంలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : పేదరిక నిర్మూలనే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెలిగల్లు, తూముకుంట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలం, గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటాను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడక్కడ వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేస్తూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అవ్వాతాతలకు యోగక్షేమాలను అడుగుతూ భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రమాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వెలిగల్లు, తూముకుంట, పలు గ్రామాల్లో రూ.8.03కోట్లు సోలార్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మోద్దీన్, ఎంపీటీసీ సభ్యులు షానవాజ్, సర్పంచ్‌లు చెన్నకేశవరెడ్డి, ఉమాప్రభాకర్, జానకమ్మ, సచివాలయం కన్వీనర్ ఆంజనేయులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మారెడ్డి, మైనార్టీ నాయకులు బాబా ఫక్రుద్దీన్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, తూముకుంట, వెలిగల్లు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ హెల్త్ ఐడీ తప్పనిసరి

రాజంపేట రూరల్ : దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఐడీ) తప్పనిసరి అని ఎన్‌సీడీసీడీపీఓ డాక్టర్ శేషగిరి బాబు అభిప్రాయపడ్డారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం అర్బన్ పరిధిలోని మన్నూరు, ఈడిగపాళెం పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో 72శాతం జనాభాకు మాత్రమే హెల్త్ ఐడీలు చేశారని మిగిలిన వారికి త్వరతగతిన చేయించాలని సూచించారు. ఈ హెల్త్ ఐడీలో ప్రతి ఒక్కరికీ ఒక నెంబరు ఇస్తున్నామన్నారు. ఈ కార్డులో వారి ఆరోగ్య పరిస్థితి మొత్తం ఆన్‌లైన్ చేయబడుతుందని తెలియజేశారు. అనంతరం పట్టణంలోని ఎగువగడ్డ, నూనివారిపల్లి రోడ్‌లలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేను తనిఖీ చేసి ఆ.భా. కార్డ్ వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్ చైతన్య, మస్తాన్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఏఎన్ఎంలు, వలంటీర్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలంబడిని సక్రమంగా నిర్వహించండి

సిద్దవటం : మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన పంపిణీ, రసాయనిక ఎరువుల పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈకేవైసీని వంద శాతం పూర్తి చేయాలన్నారు. పొలంబడి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని, స్పందన అర్జీలను స్వతరమే పరిష్కరించాలని, మండల, గ్రామ స్థాయి అధికారులు మొబైల్ నెంబర్‌లను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించాలన్నారు. ఎరువులు ముందస్తుగా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. సీఎం యాప్‌లో ఉత్పత్తుల మార్కెట్ ధరలు ప్రతి రోజు అప్లోడ్ చేయాలన్నారు. రైతులకు ఎళ్ల వేళల అందుబాటులో ఉండి నిరంతరం అన్ని రకాల సేవలను అందించాలన్నారు.





శాస్త్రీయ సమాజ నిర్మాణమే జేవీవీ లక్ష్యం

రాయచోటి అర్బన్ : సామాన్య ప్రజానీకంలో శాస్త్రవిజ్ఞాన ప్రచారం, శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక (జేవీవీ) లక్ష్యమని ఆ సంస్థ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో 'శాస్త్రీయ విజ్ఞానం కోసం జన విజ్ఞాన వేదికలో చేరండి' అంటూ ముద్రించిన పోస్టర్లను జేవీవీ నేతలు, డైట్ అధ్యాప కులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఓబులరెడ్డి, అప్‌కాస్ట్ జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, రాజశేఖర్, డైట్ అధ్యాపకులు అసదుల్లా బాషా, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, సభ్యులు రవీంద్రనాథరెడ్డి, చక్రపాణి, శంకరయ్య, రామయ్య, ప్రతాప్‌రెడ్డి, శివయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

పెనగలూరు : జూన్ మాసం ప్రారంభం కావడంతో ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సిద్ధంగా ఉండాలని రాజంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ బాబు అన్నారు. మంగళవారం రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగుకు రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందించేందుకు రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే జిల్లా వ్యవసాయశాఖ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు.

జీలుగ, జనుములు మంజూరు

పెనగలూరు మండలానికి 32.5 క్వింటాళ్ల జీలుగలు, 55.2 క్వింటాళ్ల జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రమేష్ బాబు తెలిపారు. 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పుల్లంపేట : మండల కేంద్రంలోని పర్వత వర్ధిని శాంతిలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు చాపాటి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పర్వత వర్ధిని శాంతిలింగేశ్వరస్వామి దేవస్థానం స్థాపించి 134 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కాసల నరసింహులు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి

పెనగలూరు : ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడంతో గ్రామీణ ప్రాంతాలలో అతిసారపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ తౌసిఫ్ తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో ఆసుపత్రి ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమితో ప్రజలు విరేచనాలకు లోనవుతారన్నారు. ప్రతిరోజూ అత్యధికంగా నీటిని సేవించడంతో పాటు ఓఆర్ఎస్‌లు తీసుకోవాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయండి

రాజంపేట రూరల్ : అంగనవాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీసీ సీడీపీఓ టి.సరళాదేవి ఆదేశించారు. పట్టణ పరిధిలోని మన్నూరు, జాండ్రపెంట అంగనవాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీఓ సరళాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారంతో పాటు మధ్యాహ్నం భోజనంలో నాణ్యత ఉండాలని టీచర్లను సీడీపీఓ ఆదేశించారు.

మద్దిరేవుల సర్పంచ్‌కి మాతృ వియోగం

లక్కిరెడ్డిపల్లె : మద్దిరేవుల పంచాయతీ ఈడిగపల్లికి చెందిన సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ తల్లి అయిన వీరబల్లి కృష్ణమ్మ (82) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. రామాపురం ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాజు, నాగేంద్ర, వెంకటరామిరెడ్డిలు వారి మృతదేహానికి నివాళి అర్పించారు.



ప్రారంభమైన జాతర

సంబేపల్లె : రెడ్డివారిపల్లె పంచాయతీలో వెలసిన గెవిమాతమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంతో ప్రాచుర్యమున్న ఈ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. మాతమ్మ అమ్మవారు గొప్ప మహిమ కలదని భక్తుల విశ్వాసం. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పచ్చటి తోరణాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి పల్లకీ సేవ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు.

డీఓపీకి సన్మానం

రామాపురం : ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీఓపీ)గా బాధ్యతలు చేపట్టిన జిల్లా సుదర్శన్‌రెడ్డిని మంగళవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి గాలివీడులో కలిసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలను తెలియజేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సేవకుడైన జిల్లా సుదర్శన్‌రెడ్డి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైద్యసేవలో ఆశాలు కీలకం

నందలూరు(రాజంపేట) : ప్రజలకు వైద్య సేవలందించడంలో ఆశా వర్కర్ల పాత్ర కీలకమని జిల్లా ఆశా నోడల్ అధికారిణి శ్రీవాణి అన్నారు. మంగళవారం నందలూరు పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా.చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ఓ నారాయణ, సూపర్‌వైజర్లు సునీల్, హిమశంకరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

